


TE TL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:89 | 11-08-2026 మంగళవారం | పేజీలు: 08 | వెల 3/-



# వరుణా.. కరుణ చూపవా

- నాగార్జున సాగర్‌లో మహా వరుణ యాగం
- పూర్ణాహుతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు
- యాగ క్రతువు ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ దంపతులు
- విజయపురి సౌత్‌లో మార్మోగిన వేద ఘోష
- యాదాద్రి వేదపండితుల ఆధ్వర్యంలో ఒక్క రోజు యాగం సమాప్తం

3





# మరోమారు తెలంగాణకు మొండిచేయి

- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేం
- రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 :**

కేంద్రంలోని మోదీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది.

మిగతా 3వ పేజీలో..





## నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెడతాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

- రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

2

## సాలిడ్-స్టేట్ బ్యాటరీ సాంకేతికతను అభివృద్ధి చేయాలి

- క్వాంటమ్‌స్కేప్ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం

**హైదరాబాద్, ప్రజాతంత్ర, ఆగస్టు 10:**

తెలంగాణను అధునాతన తయారీ, స్వచ్ఛ ఇంధన రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చే

మిగతా 2వ పేజీలో..



## లాల్‌దర్వాజా మహంకాళి భవిష్యవాణి.. పాపాలు, దారుణాలు పెరిగాయని ఆందోళన

- భక్తుల పూజలతో అమ్మవారు సంతోషించారని ప్రకటన
- పసుపు, కుంకుమలతో ఆరాధిస్తే కోరికలు నెరవేరుతాయని వెల్లడి
- పసిపిల్లలపై దారుణాలు పెరగడంపై ఆందోళన
- రాష్ట్రం, దేశం సుభిక్షం కోసం శాఖ పూజలకు పిలుపు
- ప్రజా సంక్షేమానికి కృషి చేసే ప్రభుత్వాలకు ఆశీస్సులు

2





## మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్‌రెడ్డి

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు

2



## ముగిసిన 'సర్' ప్రక్రియ

- రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు

2



## హుస్సేన్‌సాగర్–ప్రకాశం బ్యారేజీ మధ్య సీప్లేన్ సేవలు

- హుస్సేన్‌సాగర్‌లో వాటర్ ఏరోడ్రోమ్ ఏర్పాటుపై సర్వే
- విజయవాడలోనూ త్వరలో ఏఏఐ పరిశీలన
- రేవంత్‌రెడ్డి చొరవతో ప్రతిపాదనకు వేగం
- తెలంగాణ, ఏపీ మధ్య ప్రత్యేక టూరిజం సర్క్యూట్
- ఒక్కో సీ-ప్లేన్‌లో 9 నుంచి 12 మంది ప్రయాణించే అవకాశం

2

**హైదరాబాద్, ఆగస్టు 10:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య సీప్లేన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రతిపాదన కార్యరూపం దాల్చే దిశగా అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్ సేవలు ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు హుస్సేన్‌సాగర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశారు. రెండు రాష్ట్రాలను అనుసంధానించే కొత్త పర్యాటక మార్గాన్ని అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

**రేవంత్‌రెడ్డి చొరవతో**

ఢిల్లీ పర్యటనలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో సీప్లేన్ ప్రతిపాదనపై చర్చించినట్లు సమాచారం. హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీ మార్గంలో సేవలు అందుబాటులోకి వస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానించే ప్రత్యేక సర్క్యూట్ ఏర్పడుతుందని ఇరువురు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. దీంతో ప్రాజెక్టు కార్యాచరణపై కసరత్తు వేగం పుంజుకుంది.

## బీసీలతోపాటు అన్ని కులాలకు సమానావకాశాలు

- రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
- స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
- పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడి

2



DD9 వార్త
తెలుగు దినపత్రిక
# DD9 Vaartha
మంగళవారం
11-08-2026



## మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్‌రెడ్డి

**కమలాపూర్, ఆగస్టు 10:**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం రాజకీయ రగడకు దారితీసింది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రసంగాల్లో గత ప్రభుత్వంపై చేసిన విమర్శలను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేదికపైనే తప్పుబట్టారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా.. ఇరువర్గాల కార్యకర్తలు నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**గత ప్రభుత్వంపై మంత్రుల విమర్శలు**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవం, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కోసం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ కమలాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలివేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తున్నామని తెలిపారు.

**వేదికపైనే కౌశిక్‌రెడ్డి అభ్యంతరం**

మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొంటూ మంత్రుల వ్యాఖ్యలను తప్పుబట్టారు. వాస్తవాలను మాత్రమే మాట్లాడాలని, ప్రజల కోసం నిర్వహిస్తున్న అధికారిక కార్యక్రమాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదని మంత్రులకు సూచించారు.

**కార్యకర్తల నినాదాలతో ఉద్రిక్తత**

ఎమ్మెల్యే స్పందనతో సభా ప్రాంగణంలో ఉద్రిక్తత పెరిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి వేడెక్కింది. ఇరువర్గాల మధ్య వాగ్వాదం మరింత ముదరడంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకున్నారు. పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు చేపట్టారు.

**పోలీసుల జోక్యంతో సద్దుమణిగి**

పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేయడంతో కొద్దిసేపటికి పరిస్థితి అదుపులోకి వచ్చింది. అనంతరం కార్యక్రమాన్ని కొనసాగించారు. కమలాపూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న మంత్రులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అధికారిక కార్యక్రమంలో రాజకీయ విమర్శలపై జరిగిన ఈ వివాదం స్థానికంగా చర్చనీయాంశమైంది.




## లాల్‌దర్వాజా మహంకాళి భవిష్యవాణి.. పాపాలు, దారుణాలు పెరిగాయని ఆందోళన

**హైదరాబాద్, ఆగస్టు 10:**

లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రంగం కార్యక్రమంలో మాతంగి అనురాధ అమ్మవారి భవిష్యవాణిని వినిపించారు. భక్తుల పూజలు, నైవేద్యాలతో అమ్మవారు సంతోషించారని, పసుపు, కుంకుమలతో భక్తిశ్రద్ధలతో ఆరాధించే వారికి కోరికలు నెరవేర్చి సుభిక్షంగా కాపాడతానని తెలిపారు. సమాజంలో పాపాలు, అనుకోని విపత్తులు, పసిపిల్లలపై జరుగుతున్న ఘోరాలు పెరిగిపోవడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

**పాపాలు పెరగడంపై ఆందోళన**

తాను శాంతంగా ఉన్నప్పటికీ తనను ఉగ్రరూపంలో చూపిస్తున్నారని మాతంగి అనురాధ పేర్కొన్నారు. కలికాల ప్రభావంతోనే సమాజంలో అనేక దారుణాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అయితే భక్తి, ధర్మంతో జీవించే వారికి ముక్తి, శక్తి, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. గ్రామగ్రామాన ఉండి ప్రజలను కాపాడతానని అభయమిచ్చారు.

**ఐదు వారాల పాటు శాఖ పూజలు**

రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండేందుకు ఐదు వారాల పాటు శాఖ పూజలు నిర్వహించాలని భవిష్యవాణిలో సూచించారు. చెడు మార్గంలో నడిచేవారిని, నేరాలకు పాల్పడే వారిని తప్పకుండా శిక్షిస్తానని హెచ్చరించారు. అదే సమయంలో ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వాలకు అమ్మవారి ఆశీస్సులు కొనసాగుతాయని తెలిపారు.

**భక్తులు భయపడొద్దు**

ధర్మబద్ధమైన జీవనం సాగిస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించే వారు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మాతంగి అనురాధ పేర్కొన్నారు. భక్తులకు ఎల్లప్పుడూ అమ్మవారి రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా జరిగిన రంగం కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెడతాం

**మొదటిపేజీ తరువాయి**



ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు సిద్దిపేట ఎమ్మెల్యే, మరో నేత హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు లక్షకుపైగా తరలి వచ్చారు.. 12 గంటలపాటు వర్షం పడుతున్నా అంతిమయాత్రలో పాల్గొన్నారు.. ఆయన ఎలాంటి వ్యక్తో తెలిపేందుకు ఇదే నిదర్శనం అన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళుల ర్పిద్దామని కేటీఆర్ అన్నారు.

## సాలిడ్‌స్టేట్ బ్యాటరీ సాంకేతికతను అభివృద్ధి చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక అడుగులు వేస్తున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన సాన్ జోస్‌లోని ప్రసిద్ధ బ్యాటరీ సాంకేతిక సంస్థ 'క్వాంటమ్‌స్కేప్' ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ శివ శివరామ్ సహా ఉన్నతాధికారుల బృందంతో భేటీ అయి, తదుపరి తరం బ్యాటరీ సాంకేతికతలు, గ్లోబల్ సప్లై చైన్ మరియు పెట్టుబడుల అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సాంప్రదాయ లిథియంఅయాన్ బ్యాటరీల కంటే అత్యంత సురక్షితమైన, వేగంగా ఛార్జ్ అయ్యే, ఎక్కువ శక్తి నిల్వ సామర్థ్యం గల 'సాలిడ్‌స్టేట్ లిథియంమెటల్' బ్యాటరీల అభివృద్ధిని డాక్టర్ శివరామ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రయోగశాల స్థాయి పరిశోధనలను వాణిజ్యపరంగా భారీ స్థాయి తయారీకి తీసుకెళ్లడంలో ఎదురవుతున్న సవాళ్లను, సంస్థ సాధించిన ప్రగతిని డిప్యూటీ సీఎంకు వివరించారు. గ్లోబల్ సప్లై చైన్ - భవిష్యత్ మార్పులు కీలక ఖనిజాల లభ్యత, అధునాతన విడిభాగాల తయారీ, సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలలో వీటి వినియోగంపై ఇరువర్గాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. భవిష్యత్తులో ఈ నూతన బ్యాటరీ సాంకేతికతలు గ్లోబల్ సరఫరా గొలుసును ఎలా పునర్నిర్మిస్తాయో, కొత్త భాగస్వామ్యాలకు ఎలా బాటలు వేస్తాయో విశ్లేషించారు.

**తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం**

రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యవస్థ, అత్యుత్తమ ఇంజనీరింగ్ ప్రతిభ, స్వచ్ఛ ఇంధన రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రస్తావించారు. ఆర్ అండ్ డి , విడిభాగాల తయారీ, సరఫరా గొలుసు భాగస్వామ్యాలతో పాటు, భవిష్యత్తులో ఈ సాంకేతికతను భారత్‌లోనే స్థానికీకరించే దిశగా తెలంగాణలో విస్తరణ అవకాశాలను పరిశీలించాలని క్వాంటమ్‌స్కేప్ ప్రతినిధులను కోరారు. అంతర్జాతీయ ఆవిష్కరణల దిగ్గజాలకు, తెలంగాణలో వేగంగా పెరుగుతున్న సాంకేతిక, తయారీ రంగాలకు మధ్య బలమైన అనుసంధానాన్ని ఏర్పరచడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది.

**గ్లోబల్ హబ్‌గా తెలంగాణ ఇంధన రంగం**

అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని ఇండియా ఎనర్జీ క్లైమేట్ సెంటర్‌ను భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో దేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్‌ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం, సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రాణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎంకుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు క్లీన్ టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక, వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ సర్కారు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## హుస్సేన్‌సాగర్–ప్రకాశం బ్యారేజీ మధ్య సీప్లేన్ సేవలు




**వాటర్ ఏరోడ్రోమ్‌పై పరిశీలన**

ఏఏఐ ఉన్నతాధికారుల బృందం ఇటీవల హుస్సేన్‌సాగర్‌ను సందర్శించి సీప్లేన్ కార్యకలాపాలకు అనువైన ప్రాంతాలను పరిశీలించింది. విమానాలు నీటిపై సురక్షితంగా దిగడం, టేకాఫ్ కావడానికి అవసరమైన పరిస్థితులతో పాటు నీటి లోతు, ప్రయాణికుల రాకపోకలకు అనుకూలమైన ప్రాంతాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. సర్వే ఆధారంగా వాటర్ ఏరోడ్రోమ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రాథమిక అంచనాలను సిద్ధం చేయనున్నారు.

**ప్రకాశం బ్యారేజీ వద్ద సర్వే**

హుస్సేన్‌సాగర్ పరిశీలన అనంతరం ఏఏఐ అధికారులు విజయవాడ ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలోనూ క్షేత్రస్థాయి అధ్యయనం చేయనున్నారు. రెండు ప్రాంతాల్లో సేకరించిన వివరాలను పరిశీలించిన తర్వాత సీప్లేన్ సేవల నిర్వహణకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించే అవకాశం ఉంది. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టనున్నాయి.

**రన్‌వే అవసరం లేదు**

సీప్లేన్‌ల ప్రత్యేకత కారణంగా వీటి కోసం సాధారణ విమానాశ్రయాల్లో ఉండే రన్‌వే అవసరం ఉండదు. నీటి ఉపరితలంపైనే దిగడం, అక్కడి నుంచే గాల్లోకి ఎగరడం వీటి విధానం. ఇందుకోసం నీటిపై వాటర్ ఏరోడ్రోమ్‌లను ఏర్పాటు చేస్తారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఒక్కో సీప్లేన్‌లో 9 నుంచి 12 మంది వరకు ప్రయాణించే అవకాశం ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో గతంలో సీప్లేన్‌ల ప్రయోగాత్మక ప్రయాణాలు జరిగినప్పటికీ, ఈసారి క్రమబద్ధమైన సేవలను ప్రారంభించాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ఏఏఐ తుది నివేదికలో ప్రాజెక్టుకు అనుకూలమైన అంశాలు నిర్ధారణ అయితే తదుపరి అనుమతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఈ సేవలు అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణంతో పాటు పర్యాటక రంగానికి కూడా కొత్త ఊపునిచ్చే అవకాశముంది.




## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

**హైదరాబాద్, ఆగస్టు 10 :**

తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఇంజన్2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

## ముగిసిన 'సర్' ప్రక్రియ

- **రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది వోటర్లు**

**హైదరాబాద్, ఆగస్ట్ 10:**

రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ (సర్) పక్రియ ముగిసింది. మొత్తం 3,38,26,448 మంది వోటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. 73,95,954 మంది వోటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తయి చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. 'సర్' పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు, 17న ముసాయిదా వోటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది వోటర్ల జాబితా విడుదల కానుంది.

## బీసీలతోపాటు అన్ని కులాలకు సమానావకాశాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 10:**

బీసీలతోపాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఎంతోమంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# వరుణా.. కరుణ చూపవా

**నాగార్జునసాగర్, ఆగస్టు 10 :**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని దేవీదేవతలను వేడుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్ తీరంలోని విజయ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున సోమవారం బ్రహ్మముహూర్తంలో మహా వరుణ యాగం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో సాయంత్రం ఈ పవిత్ర వరుణ యాగంలో పూర్ణాహుతి సమర్పించారు. దీంతో యాగం సమాప్తమైంది. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణాగోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, జలాశయాలు నిండాలని, రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరియాలని సంకల్పిస్తూ వేకువ జామునే 108 మంది రుత్వికులు, వేదపండితులు, అర్చకులు ఈ మహా క్రతువులో భాగస్వాములయ్యారు. ఋత్వికులు గోపూజ, ఋష్యశృంగ పూజ, యాగశాల ప్రవేశం చేయించగా నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి యాగ క్రతువులో పాల్గొన్నారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ వరుణ యాగం నిర్వహించామని తెలిపారు. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహించాలని వేడుకున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి.. కృష్ణా గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లతోపాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి.. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలి.. భూగర్భ జలాలు పెరగాలి.. పంటలు పుష్కలంగా పండాలి.. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి.. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలి' అని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ యాగంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**క్రతువు ఆరంభించిన మంత్రి ఉత్తమ్ దంపతులు**

సూర్యకిరణాలు కృష్ణమ్మ జలాలను తాకక ముందే నాగార్జునసాగర్ పరిసరాల్లో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ వేదమంత్రాలు మార్మోగాయి. వర్షాలకు అధిదేవత అయిన వరుణుడి కరుణ తెలంగాణపై ప్రసరించాలని కోరుతూ రుత్వికులు చేసిన మంత్రోచ్ఛారణలతో కృష్ణాతీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఋగ్, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలను వేదపండితులు పారాయణం చేస్తూ క్రతువును ప్రారంభించారు. ప్రధాన యాగ క్రతువు కోసం 32మంది రుత్వికులు యాగశాలలో నిర్దేశించిన స్థానాల్లో ఆశీనులు కాగా మిగిలిన రుత్వికులు నిరంతర వేదపారాయణం, జపంలో పాల్గొన్నారు. చతుర్వేద పారాయణం అనంతరం 11 హోమకుండాల్లో అగ్నిని ప్రజ్వలింపజేసి వరుణ దేవుడిని ఆవాహన చేస్తూ హోమాలు నిర్వహించారు. ఆకాశంజలంభూమిమానవాళి మధ్య సమతుల్యత నెలకొనాలని ఆకాంక్షిస్తూ వేదమంత్రాల నడుమ హోమద్రవ్యాలను అగ్నికి సమర్పించారు.



ఒకవైపు కృష్ణమ్మ విశాల జలరాశి, మరోవైపు హోమకుండాల్లో ఎగసిపడుతున్న అగ్నిజ్వాలలు.. వాటి మధ్య ప్రతిధ్వనించిన వేదఘోషతో సాగర్ తీరం భక్తిభావంతో నిండిపోయింది.

**విజయపురికి వరుణారాధనతో ప్రాచీన అనుబంధం**

వరుణ యాగం నిర్వహించిన ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం కూడా ఉందని యాగ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రాచీన కాలంలోనే వరుణారాధన జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయని వేదపండితులు వివరించారు. వరుణుడితో సంబంధం ఉన్న ఒక ప్రాచీన ప్రతిమ ప్రస్తుతం నల్లగొండ మ్యూజియంలో భద్రపరిచి ఉందని పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా ప్రస్తుతం జరుగుతున్న మహా వరుణ యాగానికి మరింత ఆధ్యాత్మిక విశిష్టత చేకూరిందని తెలిపారు. శతాబ్దాల కిందట జలాల కోసం ఇదే నేలపై వినిపించిన వరుణ ప్రార్థన ఇప్పుడు మరోసారి కృష్ణమ్మ ఒడ్డున వేదఘోషగా ప్రతిధ్వనించడం యాగానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఆచార్య వెంకటాచార్యులు, నరేష్ శర్మ, వెంకటరామశర్మ, ఆదిత్య శర్మతోపాటు పలువురు వేద పండితులు యాగ క్రతువును నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా, సమానంగా వర్షాలు కురవాలని రుత్వికులు ప్రార్థించారు. అంతేకాక కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో కూడా విస్తారంగా వర్షాలు కురవాలని, తద్వారా రెండు మహానదులకు నిరంతర ప్రవాహాలు వచ్చి తెలంగాణ జలాశయాలు నిండాలని సంకల్పించారు. చెరువులు కళకళలాడాలని, భూగర్భ జలాలు పెరగాలని, ఖరీఫ్ పంటలకు నీటి కొరత రాకూడదని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థించారు. ప్రస్తుత సీజన్‌లో వర్షపాతం అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా లేకపోవడం, రానున్న రోజుల్లో వర్షాల తీరుపై నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఆధ్యాత్మిక ప్రార్థనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఒకవైపు ఇంజినీర్లు జలాశయాల్లో నీటి నిల్వలు, నదుల్లో ప్రవాహాలు, సాగునీటి అవసరాలను నిరంతరం పరిశీలిస్తుంటే మరోవైపు ఆ జలాలన్నింటికీ మూలమైన ఆకాశం వైపు విజయపురి నుంచి వేదమంత్రాలతో ప్రార్థనలు సాగాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మహా వరుణ యాగం రోజంతా కొనసాగింది. ఉదయం నుంచి విజయపురిలో కనిపించిన దృశ్యం అపూర్వం. భాష వేల ఏళ్లనాటిది కావచ్చు కానీ ఆ మంత్రాల వెనుక ఉన్న ఆకాంక్ష మాత్రం వరుణుడు కరుణించాలని, తెలంగాణ నేలపై సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణాగోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు, జలాశయాలు నిండాలని, ఆకాశం వైపు చూసే అన్నదాత కళ్లలో ఆశ కనిపించాలన్నది మహా వరుణ యాగం సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. యాగ క్రతువులో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, యాదగిరిగుట్ట ఈవో భవాని శంకర్, డిప్యూటీ ఈవో, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రైతుకు అండ.. అదే మా ధ్యేయం

- **ఆర్థికంగా అనుకూలించకున్నా రైతు సంక్షేమానికి ప్రాధాన్యం**
- **మాట ప్రకారం ధరణిని బంగాళాఖాతంలో కలిపాం**
- **హన్మకొండలో రైతు మేళాలో రెవెన్యూ మంత్రి పొంగులేటి**

**హనుమకొండ, ఆగస్టు 10:**

రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాక□ర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని ఇచ్చిన మాట ప్రకారం బంగాళాఖాతంలో వేశాం.. రైతుల భూములకు శాశ్వత భద్రత కల్పించే భూభారతిని తీసుకొచ్చాం అని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వ్యవస్థతో రైతులు, భూయజమానులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, భూ హక్కుల విషయంలో ఏర్పడిన గందరగోళానికి శాశ్వత పరిష్కారం చూపించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై పడిందని అన్నారు. రైతు భూమి రైతుదే అనే భరోసా కల్పించడమే భూభారతి ప్రధాన ఉద్దేశమని, భూ రికార్డులను ప్రక్షాళన చేసి పారదర్శకంగా హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. భూములపై స్పష్టమైన హక్కులు, రికార్డులు, మ్యాప్‌లు అందుబాటులో ఉంటే భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలకు అవకాశం ఉండదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాక రైతు, భూ యజమాని భవిష్యత్ తరాలకు భద్రత కల్పించాలనే చిత్తశుద్ధితో భూభారతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత పదేళ్లలో రైతులు, భూ యజమానులు ఎదుర్కొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు సంక్షేమం విషయంలో మాటలు చెప్పడం కాదు.. బడ్జెట్‌లో నిధులు పెంచి రైతుకు ఆర్థిక భరోసా కల్పించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని అంగీకరించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో గోదాములు, నిల్వ సామర్థ్యం పెంచకపోవడం వల్ల ఏర్పడిన లోటును తమ ప్రభుత్వం అధిగమిస్తోందన్నారు. రైతును రాజకీయాలకు ఉపయోగించుకోవడం కాదు.. రైతుకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటితో మంచి దిగుబడి, ఆదాయం అందించే పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు ఒకవైపు, రైతుల అనుభవం మరోవైపు.. రెండింటినీ సమన్వయం చేసుకుంటే వ్యవసాయంలో మరిన్ని మంచి ఫలితాలు సాధించవచ్చని మంత్రి పేర్కొన్నారు.

**ప్రతీ పేద కుటుంబానికి దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు**

అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి అన్నారు. పేదల సంక్షేమానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వమని, పేదల కష్టాలు, బాధలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ చేపట్టామని మంత్రి తెలిపారు. మూడో, నాలుగో దశల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని, ప్రతిపేద కుటుంబానికి సొంతింటిని అందించే వరకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపులో ఎలాంటి పక్షపాతం చూపడం లేకుండా ముఖ్యమంత్రి నియోజకవర్గం, మంత్రుల నియోజకవర్గాలతోపాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా అర్హత ఆధారంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదోడు ఏ కులం, ఏ మతం, ఏ పార్టీకి చెందినవాడన్నది కాక అర్హతే ప్రామాణికంగా ఇళ్లను అందిస్తున్నామన్నారు. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి విడత నిధులను విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. లబ్ధిదారుల కాలనీల్లో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు పరిమిత సంఖ్యలో ఇళ్లు అందించిన పరిస్థితికి భిన్నంగా ప్రజా ప్రభుత్వం దశలవారీగా సుమారు ఎనిమిది లక్షల ఇళ్లను ఇప్పటివరకు మంజూరు చేసి పేదలకు అందించే దిశగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ముఖాల్లో సంతోషం చూడటమే అని స్పష్టం చేశారు. కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

# మత్స్యకారుల సామాజిక భద్రతకు ప్రాధాన్యత

- **ప్రమాదవశాత్తు మరణం, వికలాంగతకు రూ.5 లక్షల వరకు బీమా**
- **మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి శ్రీహరి**

**హైదరాబాద్, ఆగస్టు 10 :**

రాష్ట్రంలోని 4,21,767మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం (జీఏఐఎస్) అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసుల, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 202627లో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.5.00 లక్షలు, శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5.00 లక్షలు, శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు, ప్రమాదవశాత్తు హాస్పిటల్‌లో చికిత్స పొందితే గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్య శాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతోపాటు వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కీలకమైనదన్నారు.



# మరోమారు తెలంగాణకు మొండిచేయి

**మొదటిపేజీ తరువాయి**

చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతర్రాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నోఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతరాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.



# సమ్మక్క, సారక్కలకు మంత్రి సీతక్క పూజలు

- **అభివృద్ధి పనుల పరిశీలన**

**తాడ్వాయి, ఆగస్టు 10 :**

తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి అనసూయ ఆలయ పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులతోపాటు ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న నూతన క్యూ లైన్ ఏర్పాటు అంశాలను పరిశీలించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ ఈవో, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్'కు గడువు పొడిగింపు

- **15 వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు**
- **గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, ఆగస్టు 10:**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజులపాటు పొడిగిస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చి నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం కింద లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు. ఈ 'టవర్స్'కు ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజులపాటు పొడిగించినట్లు వెల్లడించారు. తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు 10వ తేదీ వరకు ఉంది. గత నెల 21 నుంచి మీసేవ కేంద్రాలతోపాటు ఆన్‌లైన్ ద్వారా, మీసేవ వాట్సాప్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎలాంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా.. దేశభక్తిని చాటుదాం

### 8వ కాలనీ మండలంలో జాతీయ జెండా ఆవిష్కరణ

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 10 (డీడీ9 వార్త):**




భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా–తిరంగా యాత్రలో భాగంగా 8వ కాలనీ మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బిల్డింగ్ డిపార్ట్‌మెంట్ మురళీ చౌక్ వద్ద బీజేపీ 8వ కాలనీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్తి నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మూకిరి రాజు, ఆకుల కుమార్ గౌడ్, మహిళా నాయకురాలు జనగామ సుజాశ్రీ, నాగ శ్రీనివాస్, తిరంగా యాత్ర మండల కన్వీనర్ ఐలవేని అనిల్ కుమార్, లింగం నాయక్, జంజర్ల శ్రీనివాస్, మైనార్టీ నాయకులు ఎస్కే పాషా, చొప్పరి స్వామి, సూర్య ప్రకాష్, గంధం శంకర్, మంద సాయి ప్రణీత్, అఖిల్ గౌడ్, రవీందర్, జితేంద్ర, అభిరామ్, శివ సాయి, రంజిత్, విక్కీ, గణేష్, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా త్రివర్ణం.. ప్రతి గుండెలో దేశభక్తి

### హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో బీజేపీ నాయకుల పిలుపు



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 10 (డీడీ9 వార్త):**

గోదావరిఖనిలోని తిరుమలనగర్ వద్ద సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ కొమ్ముల స్వామి ఆధ్వర్యంలో, మండల అధ్యక్షురాలు అపర్ణ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు మాది కొండ శ్రీనివాస్ పూలమాల సమర్పించగా, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించాలని అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని, దేశభక్తి భావాన్ని ప్రతి కుటుంబంలో చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర నాయకులు కొమ్ముల మహేష్, కందుల సంధ్యారాణి, కొండపర్తి సంజీవ్, సుల్వ లక్ష్మీనారాయణ, మాచా విశ్వాస్, భారతి, కోడూరి రమేష్, సాగర్, బుంగా మహేష్, పుప్పాల కుమార్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదామని నాయకులు పిలుపునిచ్చారు.

## ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం సహాయనిధి అండ..

### రూ.5.20 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**మణుగూరు.ఆగస్టు 10 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గంలోని పినపాక, మణుగూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.5.20 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) చెక్కులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకున్న మంత్రి సీతక్క

- తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను మంత్రి దనసరి అనసూయ సీతక్క దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు

**తాడ్వాయి డిడి9 వార్త**



అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి అనసూయ సీతక్క, ఆలయ పీటీ బీమ్స్, క్యూ లైన్లు, మీడియా టవర్లు, గ్రానైట్ పనులతో పాటు ఆలయ ప్రాంగణం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న నూతన క్యూ లైన్ ఏర్పాటుకు అవసరమైన అంశాలను పరిశీలించారు. ఈవో కార్యాలయ పరిసరాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మండల అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి , డీపీఓ వెంకయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు , స్థానిక సర్పంచ్ పీరీల భారతి –వెంకన్న , ఆత్మ డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్ , మాజీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ , మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర రావు , సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్ , జిల్లా కార్యదర్శి ఇర్ప సునీల్ , మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు గౌడ్ , మేడారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రానా రమేష్ , సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య , జిల్లా నాయకులు తాండాల శ్రీను , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గద్దం నాగ భూషణం , సర్పంచులు సర్పంచ్ తోలేం కృష్ణ ఉప సర్పంచ్లు కట్కూరి భాస్కర్ రెడ్డి , ఆలకుంట వనిత – కృష్ణ , మండల నాయకులు మడకం శోభన్ , అనుమాండ్ల రాజీ రెడ్డి , ఆలేటి జైపాల్ రెడ్డి , కల్వల సమ్మయ్య , ఎండీ ఆదిల్ , తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ , తదితర నాయకులు పాల్గొన్నారు.

## అసలు గోదావరిఖని లో ఏం జరుగుతుంది.....?

- అక్రమ కట్టడాలని ఇబ్బంది పెడుతున్న సింగరేణి చర్యలను ఖండించిన టిఎన్టియుసి.

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 10:**



రామగుండం నియోజకవర్గం లో రోడ్డు వెడల్పు పేరిట బాధిత షాపింగ్ లకు పర్మిషన్ ఇస్తున్నారు.. తీరా కట్టుకున్నాక పర్మిషన్ లేదంటూ కూలగొట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన నిమ్మకాయల ఏడుకొండలు.గోదావరిఖని చౌరస్తా, తిలక్ నగర్, ఎల్. బి నగర్ లో కూల గొట్టడాన్ని టి ఎన్ టియు సి నాయకులు నిమ్మకాయల ఏడుకొండలు తీవ్రంగా ఖండించారు. ఇక్కడ ప్రజా పాలన నడుస్తుందా ప్రజా కంటక పాలన నడుస్తుందా అర్థం కావడం లేదని ఒకపక్క అభివృద్ధి అంటూ నూతన నిర్మాణాలు లబ్ధిదారులకు న్యాయం అంటూనే మరోపక్క సింగరేణి యాజమాన్యం ఒక మాట మున్సిపల్ అధికారులు మరొక మాట ప్రజాప్రతినిధులు మరో విధంగా మాట్లాడుతూ ప్రజలను బాధితులను లబ్ధిదారులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్న ఈ రాజకీయ క్రీడలు ఆపాలని నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని లేని పక్షంలో టిడిపి టిఎన్టీయూసీ పక్షాన ఆందోళన తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా క్వార్టర్స్ పక్కన సింగరేణి కార్మికులు పిల్లల పెద్దవాళ్ళు అయిన తర్వాత రేకుల షెడ్లు నిర్మించుకుంటే అవి కూడా తీయాలని సింగరేణి యాజమాన్యానికి నోటీసులు ఇవ్వడం సరైన విధానం కాదు తక్షణమే వాటికి కూడా సింగరేణి యాజమాన్యమే పర్మిషన్స్ ఇచ్చి నిర్మించుకునే సదుపాయం కల్పించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ టి ఎన్ టి యుసి డిమాండ్ చేశారు.కే నిమ్మకాయలు ఏడుకొండలు సింగరేణి కాల రిస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, టి మణిరామ్ సింగ్ సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీ, ముదుగంటి దామోదర్ రెడ్డి పెద్దపల్లి పార్లమెంట్ టిఎన్టియుసి అధ్యక్షుడు, పెగడపల్లి రాజనర్సు టిఎన్టియుసి కోశాధికారి, కొండి శ్రీనివాస్ పెద్దపల్లి పార్లమెంట్ టి ఎన్ టి యుసి ప్రచార కార్యదర్శి, బెక్కం వీరేందర్ మాజీ టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి,కామెర రాజబాబు రామగుండం ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు, సుందిళ్ల స్వామి ఎస్సీ సెల్ కార్పొరేషన్ మాజీ కార్యదర్శి.తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా నగర్ లో ఆషాడ మాస గోరింటాకు మహోత్సవ కార్యక్రమం

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 10:**



ఈరోజు స్థానిక దుర్గా నగర్ కాలనీలో ఆషాడ మాస గోరింటాకు వేడుకలు మహిళా సోదరీమణులందరూ కలిసి అట్టహాసంగా సంబరం అంబరాన్ని అంటేలా ఆనందోత్సాహాల మధ్య జరిగాయి ఇట్టి వేడుకలకు ముఖ్యఅతిథిగా రాజ్ ఠాకూర్ సేవా సమితి అధ్యక్షురాలు మనాలి సింగ్ రాజ్ ఠాకూర్ మరియు 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి పాల్గొన్నారు ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న మనాలి సింగ్ రాజ్ ఠాకూర్ జ్యోతి ప్రజ్వలన చేసి మహిళ సోదరీమణులకు గోరింటాకు పెట్టి అందరిని అభినందించారు వారు మాట్లాడుతూ ఈ ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతిలో భాగమని ఇలాంటి వేడుకలను దుర్గా నగర్ మహిళలందరూ ఒకచోట చేరి అందరి సమక్షంలో జరుపుకోవడం అభినందనీయం అన్నారు రామగుండం అభివృద్ధి ప్రదాత రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా దుర్గా నగర్ నివాసికావడం మీ అందరిలో మేము ఒక్కరం అవ్వడం ఆనందంగా ఉంది అన్నారు.ఈ కార్యక్రమం దుర్గా నగర్ కాలనీ అధ్యక్షులు పందిళ్ళ బుచ్చి రెడ్డి అధ్యక్షతన జరగగా జనరల్ సెక్రెటరీ కంది రవీందర్ రెడ్డి స్వాగత ఉపన్యాసము చేయగా కమిటీ ముఖ్య సలహాదారులు పొలసాని శ్రీనివాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంథని సంపత్ సలహాదారులు స్వామి గౌడ్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఉమ్మెత్తల దేవేందర్ రెడ్డి ఉపాధ్యక్షులు కరివేద సత్యనారాయణ రెడ్డి ట్రెజరర్ కొల్లూరి సుధాకర్ కల్చరల్ సెక్రెటరీ కొల్లూరి విజేందర్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుర్రం శ్రీనివాస్ కమిటీ నాయకులు ఎతిరాజు సురేష్ మల్లేశం మల్లేశ్వరరావు కేశవులు సిహెచ్ తిరుపతి గారు మరియు మహిళా సోదరీమణులు వందల సంఖ్యలో పాల్గొని గోరింటాకు వేడుకలను విజయవంతం చేశారు.ఈ వేడుకలను మహిళా సోదరి బాలసాని పద్మ స్వామి గౌడ్ చక్కగా ఆర్గనైజ్ చేశారు.<ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న దుర్గా నగర్ మహిళా మణులకు మరియు సోదరులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు.

# ఏబీఏపీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా అందె సదానందం.. కార్యదర్శిగా వేదాంతం శేషుకుమార్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 10 (డీడీ9 వార్త):**




అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్రస్థాయి సమావేశంతో పాటు పెద్దపల్లి జిల్లా సమావేశం ఆదివారం ఎన్టీపీసీ శ్రీమయి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వాలంటీర్ కమాండెంట్ జనగామ తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పుల్లంరాజు, కార్యదర్శి దూశెట్టి భాస్కర్, కోశాధికారి పోతరాజుల రమేష్, జాతీయ సభ్యుడు పోతుగంటి గంగాధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి, అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏబీఏపీ విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణ, అయ్యప్ప తత్వం, దీక్ష నియమాలు–విశిష్టత, సంస్కృతి పరిరక్షణ, సనాతన ధర్మం, ఆచార వ్యవహారాల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక తీర్మానాలు చేశారు. ఎన్నికల అధికారులు టి.వి. పుల్లంరాజు, పోతుగంటి గంగాధర్ పర్యవేక్షణలో ఏబీఏపీ పెద్దపల్లి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అందె సదానందం, ఉపాధ్యక్షులుగా అమ్మరాజు, ముత్యాల సతీష్, కార్యదర్శిగా వేదాంతం శేషుకుమార్, సంయుక్త కార్యదర్శులుగా బొల్లం రవీందర్ గౌడ్, మారీదు మురళీకృష్ణ, కోశాధికారిగా పల్లెర్ల జగన్, జిల్లా కమాండెంట్‌గా కనకమేడ ప్రణీత్, పీఆర్వోగా ఆర్.ఎస్. మూర్తితో పాటు మరో ఎనిమిది మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఏపీ ప్రతినిధులు కందిమల్ల అంజయ్య, ముత్యం రాజు, మిట్టపల్లి సంపత్‌రావు, బయన సంతోష్, రజనీకాంత్, సదరం శ్యామ్‌సుందర్, అర్చకులు పాపిట్ల రాజానరేంద్ర శర్మ, వాణమామలై రామాచార్యులు, అట్లూరి శ్రావణ్, ఆడెపు లక్ష్మీనారాయణ గురుస్వామి, ఉప్పరి రమణయ్య, జక్కుల శ్రీనివాస్, మూల బాలయ్య, సాదుల శ్రీనివాస్, పి.ఎన్. చారి గురుస్వామి, చేరాల శ్రీనివాస్, రామటెంకి వెంకట సంతోష్, వేరుకొండ భిక్షపతి, తాటిపాముల రాజేష్, లెంకల రాజిరెడ్డి, నల్ల రాజేందర్, చొక్కా లింగం, గుంపుల తిరుపతి తదితరులతో పాటు జిల్లా నలుమూలల నుంచి అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# 12వ వేజ్‌బోర్డు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి






- నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమల్లో అమలు చేయొద్దు
- ఆర్జీ-1 జీఎం కార్యాలయం ఎదుట జాతీయ కార్మిక సంఘాల ధర్నా

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 10 (డీడీ9 వార్త):**

బొగ్గు గని కార్మికుల వేతనాల పెంపు కోసం 12వ వేజ్‌బోర్డు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమల్లో అమలు చేయొద్దని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి ఆర్జీ–1 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు.

ధర్నాలో ఏఐటీయూసీ నుంచి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ నుంచి ధర్మపురి, సీఐటీయూ నుంచి ఎస్.వీరయ్య, హెచ్‌ఎంఎస్ నుంచి దబ్బెట సతీష్ పాల్గొని మాట్లాడారు. దేశంలోని బొగ్గు గని కార్మికుల 11వ వేజ్‌బోర్డు కాలపరిమితి జూన్ 30తో ముగిసిందని, జూలై 1 నుంచి 12వ వేజ్‌బోర్డు అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ కోల్ ఇండియా యాజమాన్యం ఇప్పటివరకు వేజ్‌బోర్డు ప్రక్రియను ప్రారంభించలేదని ఆరోపించారు. గతంలో కోల్ ఇండియా యాజమాన్యంతో జరిగిన సమావేశంలో నాలుగు లేబర్ కోడ్‌ల అమలుపై ప్రస్తావన వచ్చిందని, 51 శాతం ఓట్లు సాధించిన కార్మిక సంఘంతోనే వేతన సవరణ చర్చలు జరుపుతామని యాజమాన్యం పేర్కొనడాన్ని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు వ్యతిరేకించారని తెలిపారు. గతంలో మాదిరిగానే అన్ని కేంద్ర కార్మిక సంఘాలతో 12వ వేజ్‌బోర్డు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 12వ వేజ్‌బోర్డు ప్రక్రియ ప్రారంభంపై కోల్ ఇండియా యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని నాయకులు తెలిపారు. బొగ్గు పరిశ్రమల్లో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా, వెంటనే వేజ్‌బోర్డు ప్రక్రియను ప్రారంభించేందుకు కోల్ ఇండియా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు సైతం పిలుపునిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్జీ–1 జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన ధర్నాలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, తుమ్మల రాజిరెడ్డి, సదానందంతో పాటు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హక్కులు సాధించేవరకు.. పోరాటం ఆగదు..!

- హక్కుల కోసం రోడ్డెక్కిన కార్మిక, కర్షక జనం..
- మండల కేంద్రంలో జైల్‌భరో భారీ ర్యాలీ..

**ఆగస్టు10 డిడి9 వార్త వెంకటాపురం.**




కార్మిక, కర్షక హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ, ఏఐఏడబ్ల్యూయూ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ, జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు నుంచి సినిమా హాల్, అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సెంటర్ వరకు మూడు కిలోమీటర్లకు పైగా ర్యాలీ కొనసాగింది. "క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం.. హక్కులను పరిరక్షించుకుందాం", "కార్మికుల శ్రమతో సృష్టించిన దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న విధానాలను వ్యతిరేకిద్దాం" అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో మండల కేంద్రం మారుమోగింది. ఎన్టీఆర్ సెంటర్‌లో నిర్వహించిన ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గ్యానం వాసు మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వీవీబీజీ రాంజీ బిల్లును రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల హక్కులను హరించే చర్యలను కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తే సహించేది లేదని, హక్కులు సాధించే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు–2025ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, రైతు సంఘం జిల్లా నాయకులు కుమ్మరి శీను, కట్ల నరసింహాచారి, చిట్టెం ఆదినారాయణతో పాటు దేవి, సుహాసిని, నిర్మల, బ్రహ్మం, జే.శీను, రంజిత్, రాంప్రసాద్, సుధాకర్, రాజు, మంగ, వేణి, మల్లక్క, ఎన్వీ వెంకట రమణ, పి.రత్నకుమారి, శశింతల, సత్యవతి, పి.శీను, కే.వెంకట నర్సయ్య, కురుసం మల్లయ్య, పి.కృష్ణ, సోలం రంగయ్య, కోట నాగేశ్వరరావు, కాపుల వెంకటేశ్వర్లు, బి.సాంబి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట కాంగ్రెస్ కి భారీ షాక్

- BRS పార్టీలో చేరిన 50 కుటుంబాలు
- కాంగ్రెస్ ని నమ్మి మోసపోయాం
- కెసిఆర్ గారిని ముఖ్యమంత్రి చెయ్యడమే మా లక్ష్యం అంటున్నగ్రామస్థులు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు...

**అశ్వారావుపేట:ఆగస్టు10(డిడి 9వార్త)**



అశ్వారావుపేట మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది.సహజంగా ఇతర పార్టీల నుంచి అధికారంలో ఉన్న పార్టీలోకి చేరికలు చూస్తాం కానీ అశ్వారావుపేటలో మాత్రం దీనికి బిన్నంగా ఉంది.అధికార పార్టీని వీడి కావడిగుండ్ల మరియు కాలానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ★అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ★ సమక్షంలో BRS పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారందరికీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మేము మోసపోయామని...గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే బాగున్నామని. మళ్ళీ కెసిఆర్ గారిని ముఖ్యమంత్రిగా మెచ్చా నాగేశ్వరరావు గారిని ఎమ్మెల్యే గా చేసుకునేలా కష్టపడుతామని అన్నారు. మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎప్పటికైనా పల్లెలు బాగుండాలంటే గులాబీ జెండానే ఎగరాలని.నమ్మించి మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ ది అయితే....తెలంగాణ ప్రజలను గుండెల్లో పెట్టుకున్న పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని.కెసిఆర్ గారి నాయకత్వంలో తెలంగాణను బంగారంలా తీర్చిదిద్దుకున్నామని. నేడు కాంగ్రెస్ పరిపాలనలో అభివృద్ధి అటకెక్కిందని.వారి కేవలం సంపాదించుకునే పనిలో మాత్రమే ఉన్నారని. 2సం.లు గడుస్తున్న నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని.తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో తెచ్చిన పనులను సైతం పూర్తి చెయ్యలేని దుస్థితిలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని. పట్టణాల నుంచి పల్లెల దాకా ఒకటే మాట మళ్ళీ కెసిఆర్ రావాలని అంటున్నారని.ఉదాహరణ నేడు మారుమూల ప్రాంతంలో ఒకేసారి అధికార పార్టీనీ కాదని బిఆర్ఎస్ పార్టీలో చేరడమేనని. పార్టీని మారిన్ బలంగా చేసుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తానని.మిగిలిన 2సం.లు ప్రతి ఒక BRS కుటుంబసభ్యుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని.ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తప్పకుండా వారికి భవిష్యత్తులో బుద్ధి చెప్తామని.గతంలో లా అస్సలు ఉండదని స్పష్టం చేశారు. (పార్టీలో చేరిన వారు కొమరం రవి ,కణితి వెంకటేష్ ,బాలు గారు,కొమరం హిమ చందు తదితరులు ఉన్నారు) ఈ కార్యక్రమంలో మాజీ ZPTC జూపల్లి రమణారావు , మాజీ MPP జల్లిపల్లి శ్రీరామమూర్తి, మోహన్ రెడ్డి , యుఎస్ ప్రకాశ్ రావు ,సంక ప్రసాద్ ,కలపాల బాబురావు ,ఉప సర్పంచ్ పాకనాటి నాగేశ్వరరావు ,మాజీ సర్పంచ్ నారం రాజ్ శేఖర్ ,సంకుల స్వరూపా ,శ్రీదేవి ,ఏలేటి పార్వతి ,కలపాల సురేష్ ,ఆసిఫ్ ,ఆరేపల్లి రాంబాబు,చిప్పనపల్లి శ్రీను ,ధర్మా , లింగంకుంట కృష్ణ ,బుజ్జి బాబు,అలా లింగేశ్వర రావు,ఆకుల శ్రీను , చిన్నంశెట్టి రాంబాబు ,వార్డ్ మెంబర్ సురేష్ ,నారాయణ ,జజ్జూరపు రాంబాబు,దుర్గా రావు ,నార్లపాటి వెంకన్న బాబు ,నందికొల్ల వెంకన్న బాబు ,తుంపాటి రమేష్ ,నార్లపాటి వెంకటేశ్వరరావు,దిలీప్ ,అమీర్ ,నార్లపాటి బన్ను,నార్లపాటి ప్రదీప్ ,నాగు ,ప్రేమ కుమారి , తదితరులుపార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**మణుగూరు.ఆగస్టు 10 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం కట్టుమల్లారం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నూతన గ్రామపంచాయతీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని, గ్రామ పరిపాలన మరింత మెరుగ్గా కొనసాగుతుందని అన్నారు. కట్టుమల్లారం గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. నూతన కార్యాలయ భవనాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిసిన..

### 100 పడకల ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్ డా. ఎం. రామకృష్ణ.



**మణుగూరు.ఆగస్టు 10 (డి డి 9వార్త)**

మణుగూరు 100 పడకల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డా. ఎం. రామకృష్ణ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని సోమవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డా. ఎం. రామకృష్ణకి శుభాకాంక్షలు తెలియజేసి, మణుగూరు 100 పడకల ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. బి. విశ్వ నిఖిల్, CAS RMO, డా. మోహన్ వంశీ, CASS అనస్థీషియాలజిస్ట్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీతో వ్యవసాయ కుంటలు.. రైతులకు అవగాహన



**జనగామ ఆగస్టు 10(డిడి 9వార్త )బ్యూరో**

రైతులు పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ కుంటలు నిర్మించుకోవాలని సర్పంచ్ నర్సింగ రామకృష్ణ సూచించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో రైతులకు అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డు, భూమి పాస్‌పుస్తకంతో పంచాయతీ కార్యదర్శి లేదా ఏఈఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వినయ్‌కుమార్, హార్టికల్చర్ అధికారి సందీప్, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, వార్డు సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

## ది శ్రీ రామ్ అకాడమీ పాఠశాల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం

### శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలంపతి



**హైదరాబాద్, ఆగస్ట్ 10,(డీడీ9 వార్త)**

నార్సింగి సర్కిల్ పరిధిలో జి.ఓ. 111 నిబంధనలను ఉల్లంఘిస్తూ చంద్రుకుంట చెరువు ను ఆక్రమించి నిర్మాణాలు జరుపుతున్న "ది శ్రీ రామ్ అకాడమీ"పాఠశాల అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలంపతి డిడి9 వార్త కు తెలిపారు. అలాగే గౌలిదొడ్డి, జనవాడ, మేకలగడ్డ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, భారీ షెడ్లు, కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, అలాగే నాలా ఆక్రమణలపై సంబంధిత అధికారుల తో మాట్లాడి పరిశీలిస్తామని తెలిపారు

## చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రోటరీ క్లబ్

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ
- బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు పెద్దపీట -- రోటరీ అధ్యక్షులు షేక్ అజీమ్



**భద్రాచలం, ఆగస్టు 10 (డిడి9 వార్త)**

భద్రాచలంలో సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పాత మార్కెట్లో చిరు వ్యాపారులకు రోటరీ క్లబ్ తరపున గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ అజీమ్ మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా భద్రాచలం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నూతనంగా అధ్యక్షులుగా తాను, కార్యదర్శిగా పాపినేని రాజేష్, ట్రెజరర్ గా కొత్త రామకృష్ణ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఈ ఏడాది రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు అజీమ్ స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు నేరుగా ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కుటుంబ పోషణకు ఉపయోగపడే విధంగా కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు తదితరాలను అందించడంతో పాటు అవసరమైన వారికి వివిధ రకాల సహాయ కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారికి భద్రాచలం రోటరీ క్లబ్ అండగా నిలిచింది. ఎండ, వాన నుంచి రక్షణ కల్పించడంతో పాటు వారి వ్యాపారానికి ఉపయోగపడేలా 50 మంది చిరు వ్యాపారులకు 50 గొడుగులను సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కుటుంబ పోషణ కోసం ప్రతిరోజూ రోడ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే సెప్టెంబరు నెలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలకు 120 సైకిళ్లను సెప్టెంబర్ నెలలో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పూర్వాధ్యక్షులు యశోద రాంబాబు, కటుకూరి ప్రభాకర్ గుప్తా, రొటేరియన్స్ చలపతి, కొండవీటి సందీప్, కార్యదర్శి పాపినేని రాజేష్, ట్రెజరర్ కొత్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ సొసైటీలో నూతన కార్యదర్శికి ఘన సన్మానం



**బాన్సువాడ, ఆగస్టు 10(డిడి9 వార్త):**

బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ సొసైటీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్‌కు సోమవారం ఘన సన్మానం నిర్వహించారు. సొసైటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఆయా గ్రామాల నాయకులు, సిబ్బంది నూతన కార్యదర్శిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఇదే సందర్భంగా బీర్కూర్ సొసైటీలో ఇంతకాలం కార్యదర్శిగా విధులు నిర్వహించి, బదిలీపై నస్రుల్లాబాద్‌కు వెళ్లిన మల్లోడ్డి విటల్‌ను సైతం సొసైటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఆయా గ్రామాల నాయకులు ఘనంగా సన్మానించారు.సొసైటీ అభివృద్ధికి, రైతులకు అందించిన సేవలను వారు కొనియాడారు.నూతన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీ ద్వారా అందే సేవలను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొల్లి గాంధీ, కాంగ్రెస్ పార్టీ యువనాయకులు మియాపురం శశికాంత్, ఉపసర్పంచ్ పరమేష్, డీసీసీ సెక్రెటరీ మేకల విట్టల్, ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, ఆత్మకమిటీ డైరెక్టర్ కూతాడి శంకర్, పాలకవర్గ సభ్యులు రాధాకృష్ణ, ఇంగు రాములు, సంజీవ్, సిబ్బంది, నాయకులు కొరిమె రఘు, ప్రశాంత్ యాదవ్, దుంపల రాజు, పృధ్వి, ఇందూరి గజేందర్, ఇందూరి లక్ష్మణ్, హావగిరిరావ్, దేవానంద్ దేశముఖ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

### ఆడే జైపాల్, ఏఈ గౌతమ్ కు కాలనీవాసుల కృతజ్ఞతలు



**డిడి9 వార్త గుడిహత్నూర్:**

మండల కేంద్రంలోని జైభీమ్‌నగర్‌లో కొత్తగా ఏర్పడిన కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసి రాథోడ్ ఆకాష్ ద్వారా సమస్యను తెలుసుకున్న సామాజిక కార్యకర్త, యువ నాయకుడు ఆడే జైపాల్ విద్యుత్ శాఖ ఏఈ గౌతమ్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల సమస్యపై స్పందించిన ఏఈ గౌతమ్ 13 విద్యుత్ స్తంభాలను మంజూరు చేసి ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ సానుకూలంగా స్పందించి ఎప్పటికప్పుడు సమాచారం అందించిన ఏఈ గౌతమ్‌కు ఆడే జైపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపడం అభినందనీయమన్నారు.అలాగే సమస్య పరిష్కారానికి సహకరించిన స్థానిక సర్పంచ్ ఆడే శీలా రాజేశ్వర్‌కు ఆడే జైపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆడే జైపాల్, ఏఈ గౌతమ్, సహకరించిన రాథోడ్ సతీష్‌లకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు

# కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ..

- సీపీఐ, ఎఐటియుసి, టియూసిఐ, ఎంసిపిఐ, ల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో..
- స్తంభించిన ట్రాఫిక్.

**మణుగూరు.ఆగస్టు 10 (డి డి 9వార్త)**



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు మణుగూరులో సిపిఐ, ఏఐటియుసి, టియుసిఐ, ఎంసిపిఐ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై జెండాలు చేత పట్టుకొని రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. అధికారుల జోక్యంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి లు మాట్లాడుతూ, కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వాణిజ్య ఒప్పందాలను చేస్తుందని, దేశానికి వెన్నుముక రైతు అని చెప్పిన టువంటి కేంద్రం,నేడు రైతుకి గిట్టుబాటు ధర లేకుండా, సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా, విత్తనాలకు అధిక రేట్లు పెంచుతూ, యూరియా రేట్లు రెట్టింపు చేస్తూ, ఆరు కాలం పంట పండించే రైతుకు గిట్టుబాటు ధర కల్పించకుండా మధ్య దళారీలు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు. జాతీయ ఉపాధి హామీ పథకం 100 రోజులు నుండి 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ 700 ఇవ్వాలని ఒకవైపు ఆందోళన చేస్తుంటే ఉన్న పథకాన్ని రద్దుచేసి రాంజీ పథకం పేరుతో ప్రభుత్వం కుట్ర చేస్తుందని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సవరణ 2025 చట్టం రద్దు చేయాలని, పంటకి గిట్టుబాటు ధర కల్పించాలని చట్టం చేయాలని, రుణమాఫీ, పంటల బీమా అమలు చేయాలని, నాలుగ లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున దేశవ్యా ఆందోళనకు పూనుకుంటామని వార హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐమండల కార్యదర్శి జక్కు రాజబాబు,జిల్లా సమితి సభ్యులు ఎడా రమేష్, వై రాంగోపాల్,సొం కుటుంబరావు, రైతు సంఘం మండ అధ్యక్షులు దండుగుల బాబు, ఏఐటీయూ సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు సిపిఐ మండల సహాయ కార్యదర్శి వేర్పు నరేష్, పట్టణ సహాయ కార్యదర్శి తో రమేష్,కొడిమెల సుజాత,కోశాధికా కొత్తపల్లి సీతారాములు,కన్నెబోయి ప్రసాద్,Rta నాగరాజు, బొగ్గు ముఠ కార్యదర్శి యాకూబ్ ,కణతాల కోటయ్య ఆంజనేయులు, టి యు సి ఐ నాయకుల సంజీవరెడ్డి, యాకయ, రాజేందర్,బత్తు వెంకటేశ్వర్లు,k. సుధాకర్,తిరుపతి ఎంసిపిఐ నాయకులు m. మోహనరా లు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ విధానాలపై గుండాలలో నిరసన గళం

### భారీ రాస్తారోకో.. జైల్‌భరో విజయవంతం

**గుండాల, ఆగస్టు 10 (డి డి 9 వార్త).**




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గుండాల మండల కేంద్రంలో సోమవారం భారీ రాస్తారోకో, జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ, రైతు, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పాయం సారక్క అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఊకే వెంకటేశ్వర్లు, తోలెం గోపి, సీఐటీయూ మండల నాయకులు తోలెం భూపాల్, రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు గడ్డం లాలయ్య, సీపీఐ నాయకులు సాహెబ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రంగా విమర్శలు చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో బ్రిటిష్ పరాయి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించిన చారిత్రక సందర్భాన్ని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో నేడు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగా, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలకు నష్టం కలిగించే విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చిందని వారు ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత, పని హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని కోరారు. విదేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అవకాశం కల్పించే వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించేలా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలను పెంచాలని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే వీబీజీరామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని నాయకుల డిమాండ్ చేశారు. నూతన విత్తన చట్టం, విద్యు చట్టాలను రద్దు చేయాలని, రైతుల ప్రయోజనాలన కాపాడాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ తక్షణమే స్పందించకపోతే ఉద్యమాలను మరిం ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రజ సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కార్పొరేట్ అనుకూ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాం చేశారు. అనంతరం గుండాల మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యల పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగ నినాదాలు చేశారు. అనంతరం జైల్‌భరో కార్యక్రమ నిర్వహించగా నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగ అరెస్టులకు సిద్ధమయ్యారు. దీంతో గుండాల మండ కేంద్రంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకుల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ వజ్జ సుశీల, అధ్యక్షురాలు పాయ సారక్క, సీఐటీయూ నాయకులు తోలెం భూపాల్ కొడవటంచ ఉపసర్పంచ్ జోగ రాజేష్, సాయనపల్ పంచాయతీ మాజీ సర్పంచ్ దుగ్గి రామ్మూర్తి, మండ కమిటీ సభ్యుడు వాగబోయిన నర్సింహారావు, కల్తీ శేఖర్ షేక్ జాన్ పాషా, మొక్క రాజు, దుగ్గి లక్ష్మయ్య, జబ్ ఆదిలక్ష్మి, వినోద, తోలెం లక్ష్మి, శకుంతల, మిడ్‌డే మీల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పొలెబోయిన లక్ష్మి గొట్టం రామక్క, సరోజినీ, పూణెం కోమల, విజయ సావిత్రి, సరిత, రమాదేవి, నీలిమ, కౌసల్య, సుశీల కళావతి, సుమలత, సుజాత, సత్యక్క తదితరుల పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో జైల్‌భరో ఆందోళన ఉద్రిక్తం

- కార్మిక, రైతు హక్కుల పరిరక్షణకు డిమాండ్
- పంటలకు గిట్టుబాటు ధర, కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం కోరుతూ నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (డిడీ9 వార్త)**






కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులను హరిస్తోందని కార్మిక, రైతు సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను దశలవారీగా ప్రైవేటీకరిస్తోందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన జైల్‌భరో ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. రైల్వేస్టేషన్ సెంటర్‌లో వందలాది మంది ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను, నాయకులను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కెచ్చల రంగారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి, నాయకుడు సురేందర్ ఊక్లా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే. బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు విశ్వం శెట్టి పూర్ణచంద్రరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి జలీల్, ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జాటోత్ కృష్ణ తదితరులు మాట్లాడారు. దేశ వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. బొగ్గు బ్లాకులు, అటవీ సంపద, రైల్వేలు, రహదారులు వంటి ప్రభుత్వ రంగ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని వారు హెచ్చరించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, బీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరను చట్టబద్ధం చేయాలని, కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని వారు కోరారు. కార్పొరేట్ అనుకూల విధానాలను తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో మోదీ ప్రభుత్వం పదవీ విరమణ చేయాల్సి వస్తుందని ఆందోళనకారులు నినాదాలు చేశారు. జీడీపీ వృద్ధి పేరుతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్యులపై భారం మోపుతున్నారని విమర్శించారు. కార్మికులు, రైతుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా రైల్వేస్టేషన్ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సీతారామయ్య, టీయూసీఐ నాయకుడు గోపాల్రావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు నాగభూషణం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. వివిధ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన కార్మిక కర్షక జనం






- జైల్ భరోతో దద్దరిల్లిన భద్రాచలం.. రాస్తారోకోతో స్తంభించిన రాకపోకలు
- పోలీసులతో ఆందోళనకారుల తోపులాట.. నాయకులు, కార్యకర్తల అరెస్టు

**భద్రాచలం, ఆగస్టు 10 (డిడి9 వార్త )**

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు కార్మిక–కర్షక హక్కుల పరిరక్షణ కోసం భద్రాచలం రోడ్డెక్కారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జైల్‌భరో కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో చేపట్టిన రాస్తారోకోతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. ఆందోళనకారుల నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. విజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. 'హక్కులను రక్షించుకుందాం.. కార్పొరేట్లకు దేశ సంపదను అప్పగించే విధానాలను తిప్పికొడదాం' అంటూ నినదించారు.

**పోలీసులతో తోపులాట**

రాస్తారోకో కారణంగా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులను రహదారి నుంచి తరలించే ప్రయత్నంలో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు.

**స్టేషన్ వద్ద జైల్ భరో**

అరెస్టులకు నిరసనగా కార్యకర్తలు భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడే జైల్‌భరో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**కార్మిక హక్కులను కాలరాస్తున్నారు**

సీఐటీయూ కన్వీనర్ బండారు శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఏజే రమేష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితికి నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమాలకు విరామం ఉండదని స్పష్టం చేశారు.

**పాల్గొన్న నాయకులు**

కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు ఎం.బి. నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, సీఐటీయూ జిల్లా నాయకులు ఎర్రంశెట్టి వెంకటరామారావు, కొలగాని రమేష్, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జీవనజ్యోతి, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సున్నం గంగ, పట్టణ కన్వీనర్ కుంజ శ్రీనివాస్, డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు సతీష్‌బాబు, భూపేంద్ర, ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రెటరీ రవీంద్ర, సీఐటీయూ నాయకులు అనుకోజు నరసింహచారి, చాట్ల శ్రీనివాసరావు, ఎస్.కె. జాకీర్, మార్బుల్ చంటి, స్కీం వర్కర్లు చంద్ర, లీల, వెంకటలక్ష్మి , లలిత, ఐద్వా నాయకులు లీలావతి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

# రాజా సింగ్ చూపు జనసేన వైపు

- బీజేపీకి రాజీనామా తర్వాత ఏ పార్టీలోకి..?
- అన్న ఉత్కంఠతకు తెర
- పవన్ పై ప్రశంసలు,పార్టీ కి అభినందనలు
- క్యాడర్ లో నూతనోత్సాహం నింపుతూ
- తెలంగాణ లో పోటీ చేయాలంటూ వీడియో విడుదల
- ఎంపిక చేసిన ప్రాంతాల్లో భరిలోకి దిగితే మంచి భవిష్యత్తు అంటూ జోష్యం
- వ్యూహాత్మకంగా వెళితే విజయం తధ్యం
- యువతలో ఉన్న క్రేజ్ ను రాజకీయంగా వినియోగించుకొనవాలంటూ సూచన
- రాజాసింగ్ జనసేన గూటికి చేరుతారంటూ రాజకీయ వర్గాల్లో చర్చ

**హైదరాబాద్,ఆగస్ట్ 10,(డిడి9 వార్త):**



బీజేపీకి రాజీనామా చేసిన తర్వాత ఏ పార్టీలో చేరుతారన్న ఉత్కంఠకు తెరపడకముందే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విడుదల చేసిన తాజా వీడియో తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇన్నాళ్లు రాజకీయంగా కొంత స్తబ్దతగా కనిపించిన రాజాసింగ్ ఒక్కసారిగా జనసేన పార్టీపై ప్రశంసలు కురిపించడం రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది. బీజేపీలో కీలక నేతగా ఉన్న రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన సమయంలోనే ఆయన తదుపరి రాజకీయ అడుగుపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. రాజాసింగ్ ఏ పార్టీలో చేరబోతున్నారన్న దానిపై అనేక ఊహాగానాలు వినిపించినప్పటికీ, ఇప్పటివరకు ఆయన తన తదుపరి రాజకీయ గమ్యంపై స్పష్టత ఇవ్వలేదు. అయితే తాజాగా సోమవారం విడుదల చేసిన వీడియోలో జనసేన పార్టీ, ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై రాజాసింగ్ ప్రశంసలు కురిపించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో పార్టీ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిందని రాజాసింగ్ పేర్కొన్నారు. తెలంగాణలో కూడా జనసేన రాజకీయంగా విస్తరించేందుకు ఇదే సరైన సమయమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో జనసేన అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయాల్సిన అవసరం లేదని, రాజకీయంగా అనుకూల పరిస్థితులు ఉన్న ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలోకి దింపడాన్ని పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిశీలించాలని సూచించారు. పవన్ కల్యాణ్‌కు ముఖ్యంగా యువతలో ఉన్న ఆదరణను రాజకీయంగా వినియోగించుకోవాలని కూడా రాజాసింగ్ సూచించడం ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచింది. సాధారణంగా రాజకీయ ప్రత్యర్థులపై ఘాటు విమర్శలు చేసే రాజాసింగ్.. తాజాగా జనసేన పార్టీపై, పవన్ కల్యాణ్‌పై సానుకూల వ్యాఖ్యలు చేయడం వెనుక అసలు రాజకీయ వ్యూహం ఏమిటన్న చర్చ మొదలైంది. బీజేపీకి రాజీనామా చేసిన తర్వాత రాజాసింగ్ తదుపరి అడుగు ఏమిటన్నది ఇప్పటికీ సస్పెన్స్‌గానే ఉంది. ఈ నేపథ్యంలో జనసేనపై ఆయన చేసిన వ్యాఖ్యలు జనసేనలో చేరేందుకు ముందస్తు సంకేతాలా? అన్న ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే రాజాసింగ్ స్వయంగా జనసేనలో చేరుతున్నట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆయన తాజా వ్యాఖ్యలు మాత్రం జనసేనతో ఆయన రాజకీయంగా దగ్గరవుతున్నారన్న చర్చకు బలం చేకూర్చాయి. తెలంగాణలో జనసేనకు రాజకీయంగా అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ బహిరంగంగా చెప్పడం.. పవన్ కల్యాణ్‌కు యువతలో ఉన్న క్రేజ్‌ను ప్రస్తావించడం.. ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయాలని సూచించడం.. ఈ పరిణామాలన్నీ కలిపి చూస్తే రాజాసింగ్ తదుపరి రాజకీయ అడుగుపై ఆసక్తి మరింత పెరిగింది. రాజాసింగ్ నిజంగానే జనసేన వైపు అడుగులు వేస్తున్నారా? లేక తెలంగాణలో జనసేన బలపడాలనే రాజకీయ అంచనాతోనే ఈ వ్యాఖ్యలు చేశారా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# మైలారంలో హర్ ఘర్ తిరంగా పై బీజేపీ ముఖ్య సమావేశం

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయం

**బాన్సువాడ, ఆగస్టు 10(డిడి9 వార్త):**



బాన్సువాడ నియోజకవర్గం మైలారం గ్రామంలో శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం వద్ద 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమ నిర్వహణపై బీజేపీ నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశం సోమవారం నిర్వహించారు.దేశభక్తి, జాతీయ ఐక్యతను ప్రజల్లో మరింతగా పెంపొందించాలనే లక్ష్యంతో చేపట్టనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ విధానంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించడంతో పాటు యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా విస్తృత అవగాహన కల్పించాలని నాయకులు సూచించారు.జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి భావనను ప్రతి ఒక్కరిలో పెంపొందించేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు చందూరి హన్మండ్లు, మండల ఇన్‌చార్జ్ మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు శేఖర్, ఓబీసీ మండల అధ్యక్షులు భాస్కర్ సాయిలు, దళిత మోర్చా మండల అధ్యక్షులు గంగాధర్, యువ మోర్చా మండల అధ్యక్షులు భీమరి భాస్కర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు చౌహాన్ రాందాస్, మామిళ్ల గంగారెడ్డి, బూత్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యస్వామి, కంది మల్లేష్, బతిని రాజు, సంతోష్, సాయి కుమార్, శివ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు స్మశాన వాటికకు విద్యుత్ కనెక్షన్



- సమస్యను పరిష్కరించిన మియాపురం శశికాంత్
- పోచారం శ్రీనివాస్<రెడ్డి చొరవకు స్థానికుల కృతజ్ఞతలు

**బాన్సువాడ, ఆగస్టు 10(డిడి9 వార్త):**

బీర్కూర్ పట్టణంలోని స్మశాన వాటికలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు మియాపురం శశికాంత్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు.స్మశాన వాటికలో నెలకొన్న విద్యుత్ సమస్యను బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.ఆయన చొరవతో స్మశాన వాటికకు విద్యుత్ కనెక్షన్ మంజూరై, సోమవారం విద్యుత్ సరఫరాను పూర్తి చేశారు. దీంతో స్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి పరిష్కారం కోసం కృషి చేసిన మియాపురం శశికాంత్ కు, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు చొరవ చూపిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పరమేష్, ఈవో గంగారాం, డీసీసీ సెక్రెటరీ మేకల విట్టల్,ఆత్మకమిటీ డైరెక్టర్ కుతాడి శంకర్, వార్డు మెంబర్లు కొరిమె రఘు, కొర్రీ ప్రశాంత్, ఆనంద్, నాయకులు దుంపల రాజు, అశోక్, కాంట్రాక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## దళిత, గిరిజన జర్నలిస్టులంతా సిరిసిల్లకు తరలిరావాలి

### హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలి: కాదేపురం గంగన్న

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 10(డిడి9 వార్త):**




తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులంతా ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న అన్నారు.రాజన్న సిరిసిల్లలో నేడు నిర్వహించనున్న జిల్లా మహాసభకు రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ.. సమాజానికి నాలుగో స్తంభంగా నిలుస్తున్న పత్రికా, మీడియా రంగాల్లో పనిచేస్తున్న దళిత, గిరిజన జర్నలిస్టుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణే తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దళిత, గిరిజన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో చేపడుతున్న 'చలో సిరిసిల్ల' కార్యక్రమం దళిత, గిరిజన జర్నలిస్టుల ఐక్యతను చాటిచెప్పే వేదికగా నిలుస్తుందని అన్నారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు చెందిన దళిత, గిరిజన జర్నలిస్టులు సిరిసిల్ల జిల్లా మహాసభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాదేపురం గంగన్న కోరారు.

## నిజామాబాద్ లో జనసేన బహిరంగ సభ సక్సెస్



**నిజామాబాద్ జిల్లా 10 ఆగస్టు(డీడీ9 వార్త):**

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమ్మేళనం, బహిరంగ సభ వేలాది మంది జనసైనికులు, అభిమానుల నడుమ ఘనంగా ముగిసింది. బాల్కొండ నియోజకవర్గ నాయకుడు శివ సరి ఫణీంద్ర గారి సారథ్యంలో నిరంతర కృషి, ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు మాట్లాడుతూ... బాల్కొండ ప్రాంతంలో జనసేన పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి శివ సరి ఫణీంద్ర గారు అందిస్తున్న సేవలను కొనియాడారు. పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటున్న ఆయన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు శివ సరి ఫణీంద్ర మాట్లాడుతూ... మన ప్రియతమ నాయకుడు శ్రీ పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ, సభను దిగ్విజయం చేయడానికి రాత్రింబవళ్లు శ్రమించిన జనసైనికులకు, నాయకులకు మరియు తరలివచ్చిన ప్రతి ఒక్క ఆత్మీయుడికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే జనసేన ముఖ్య లక్ష్యం అని తెలిపారు.

## జాతీయ జెండా దేశ గర్వానికి ప్రతీక: అరుణ తార



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 10(డిడి9 వార్త):**

జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే అరుణ తార పిలుపునిచ్చారు.సోమవారం కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆమె మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అరుణ తార మాట్లాడుతూ త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడికి నిరంతర స్ఫూర్తి, ప్రేరణనిచ్చే చిహ్నమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేవన్, బిచ్కుంద మండల అధ్యక్షుడు విష్ణు, సునీత రాథోడ్, గంగరాజు, దన్నూర్ విఠల్, శ్రీనివాస్, సందీప్ తోట, పత్తి రమేష్, మల్లికార్జున దేశాయ్, రామాగౌడ్, శివాజీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విధానాలపై 'జైలుభరో'

### బోధన్ లో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో





**బోధన్, నిజామాబాద్ జిల్లా 10 ఆగస్టు(డీడీ9 వార్త):**

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బోధన్ పట్టణంలో జైలుభరో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ రైల్వే గేట్ వరకు కొనసాగింది. అనంతరం నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి బి.మల్లేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.శంకర్ గౌడ్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట అమెరికాతో మోదీ ప్రభుత్వం కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను వీడకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ తదితర రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రద్దుపై మండిపడ్డ సిఐటియు

### భీంగల్‌లో భారీ ర్యాలీ, రాస్తారోకో




**నిజామాబాద్ జిల్లా 10 ఆగస్టు(డీడీ9 వార్త):**

దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు భీంగల్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉద్యోగులు, నాయకులు భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కైరిదేవ గంగు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగుల గోవర్ధన్ మరియు సిఐటియు జిల్లా అధ్యక్షులు మోహన్ ప్రసంగిస్తూ... కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం సరైంది కాదని మండిపడ్డారు. వెంటనే ఆ లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ చట్టాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలను అదుపు చేయాలని, విత్తన చట్టాన్ని సవరించి పంటలకు మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు జ్యోతి, ప్రమీల, లక్ష్మి, యమునా, భాగ్యలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతంగా పూర్తి

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 10(డిడి9 వార్త):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని జుక్కల్, యెల్లారెడ్డి, కామారెడ్డి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 796 పోలింగ్ కేంద్రాలకు చెందిన 6,96,006 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఖచ్చితత్వం మరియు పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ నమోదు చేసినట్లు తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా వివరాలు**

జుక్కల్ నియోజకవర్గంలో 2,06,343 మంది ఓటర్లకు ఫారాల పంపిణీ పూర్తికాగా, ఇప్పటివరకు 90.27 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది. యెల్లారెడ్డి నియోజకవర్గంలో 2,28,503 మంది ఓటర్లకు ఫారాల పంపిణీ పూర్తై, 90.17 శాతం డిజిటైజేషన్ జరిగింది. కామారెడ్డి నియోజకవర్గంలో 2,61,160 మంది ఓటర్లకు ఫారాల పంపిణీ పూర్తికాగా, 83.96 శాతం వివరాలు డిజిటైజ్ చేసినట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 6,11,568 ఎన్నికల ఫారాలు అంటే 87.87 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. మొత్తం 796 మంది బూత్ స్థాయి అధికారులు ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను పూర్తి చేశారు. 84,438 ధృవీకరణ కాని ఎన్నికల ఫారాలు నమోదైనట్లు వెల్లడించారు.ఎస్ఐఆర్‌లో భాగంగా మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటరుగా నమోదైన



వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత వర్గీకరణలను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

**ముసాయిదా జాబితాను పరిశీలించాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన అనంతరం ప్రతి ఓటరు తమ పేరు, చిరునామా, వయస్సు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు లేకపోయినా లేదా ఏవైనా అభ్యంతరాలు ఉన్నా నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సవరణలు, అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఓటరి పేరు జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం సరిచేసే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను నిర్ధారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## విలేజ్ పోలీస్ ఆఫీసర్ గ సేవచేస్తా గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకుంటా

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డిడి 9 వార్త)**

గ్రామ పోలీస్ అధికారిగా. తనకు బాధ్యతలు అప్పగించి న తలమడుగు మండలం లోని ఝరి గ్రామానికి SI రాధిక ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించడం జరిగింది అని అన్నారు. గ్రామస్తులతో సమావేశం అయ్యి పలు విషయాల మీద అవగాహన కల్పించడం జరిగింది అన్నారు ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ గంజాయి, గుట్కా, వంటి నిషేధిత మాదక ద్రావ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడు



కోవాలి అని సూచించారు. మరియు చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ద్విచక్ర వాహనం నడిపిన పిల్లవాణి తల్లితండ్రుల పైన కేసు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోబడుతుంది అని అన్నారు. మీ వద్ద ఉన్న పాత మొబైల్ ఫోన్లు ఎవరికీ అమ్మవద్దు వాటిపైన ఉన్న EMI నెంబర్ ద్వారా సైబర్ మోసగాళ్ళ చేతికి చేరి మీ పేరు మీద సిం కార్డు తీసుకునే ప్రమాదం ఉంది అని తనదైన శైలిలో గ్రామస్థులకు అవగాహనా కల్పించారు. మీ గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే లేదా ఫోన్ ద్వారా సంప్రధించిన. నా యొక్క ఫోన్ నెంబర్ 8712508228 (పేరు):ఊశన్న గ్రామ పోలీస్ అధికారి. మీ సమస్యను పై అదకారుల దృష్టికి తీసుకవేళ్ళి సమస్యను పరిస్కారం అయ్యే విధంగా సహకరిస్తానని అన్నారు. ఎవరు చట్టానికి చుట్టం కాదు అని చట్టం ముందు అందరు సమానులే ప్రజలందరూ చట్టాలకు అనుగుణంగా నడుచుకొని శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా సహకరించాలని ఆయన కోరారు ఈ సమావేశం లో పోలీస్ అధికారి ఊశన్న తో పాటు గ్రామస్థులు యువకులు పాల్గున్నారు.

## భక్తిశ్రద్ధలతో 'కావడి' పాదయాత్ర

- కందకుర్తి త్రివేణి సంగమం నుంచి ఏకచక్రేశ్వరాలయం వరకు నడక
- శివునికి పవిత్ర గంగాజలంతో విశేష అభిషేకం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 10 ఆగస్టు(డీడీ9 వార్త):**

శివుడిపై ఉన్న అపార భక్తి శ్రద్ధలతో పట్టణానికి చెందిన బాల్జీత్ సింగ్ వాల్మీకి పవిత్ర కావడి పాదయాత్రను వైభవంగా నిర్వహించారు. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి, మంజీరా, హరిద్ర నదుల త్రివేణి సంగమం నుంచి పవిత్ర జలాన్ని కావడిలో సేకరించి, భక్తిభావంతో బోధన్ పట్టణానికి పయనమయ్యారు. శివనామస్మరణ చేస్తూ ఎండ, అలసటను సైతం లెక్కచేయకుండా సాగిన ఈ యాత్రను మార్గమధ్యంలో పలువురు భక్తులు తిలకించి అభినందించారు. కందకుర్తి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర పట్టణంలోని ప్రసిద్ధ ఏకచక్రేశ్వరాలయానికి చేరుకుంది. ఆలయానికి చేరుకున్న అనంతరం కావడిలో తెచ్చిన పవిత్ర జలంతో ఏకచక్రేశ్వర స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్జీత్ సింగ్ మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులతో అందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు లభించాలని ఆకాంక్షిస్తూ ఈ కావడి యాత్ర చేపట్టినట్లు తెలిపారు.



# కొత్తపల్లి వద్ద బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు ఎప్పుడు?





- వారం రోజుల్లో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించాలి.
- లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా.
- ప్రతిపక్షాలను తిట్టడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టండి.
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి

**పాపన్నపేట ఆగస్టు 10**

మెదక్ నుంచి బొడ్మెట్‌పల్లి వెళ్లే ప్రధాన మార్గంలోని కొత్తపల్లి వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాపన్నపేట మండల నాయకులతో కలిసి కొత్తపల్లి వద్ద బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులతో మాట్లాడి, బ్రిడ్జి వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.1.40 కోట్లతో కొత్తపల్లి వద్ద బ్రిడ్జి నిర్మించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు మూడేళ్లు కావస్తున్నా బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పదవిలోకి వచ్చి రెండేళ్ల తొమ్మిది నెలలు గడిచినా కొత్తపల్లి బ్రిడ్జిపై కనీసం అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో మెదక్–బొడ్మెట్‌పల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి పట్టదా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ప్రతిపక్షాలను తిట్టడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పద్మా దేవేందర్ రెడ్డి సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని అన్నారు. రాజకీయ విమర్శలకు సమయం కేటాయించే బదులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు. వారం రోజుల్లోగా అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518